# మన(సు)లో మాట

'సంఘమిత్ర' త్రైమాసిక పత్రికగా బీజం నాటిన 6 నెలలో మొలకెత్తి ఆకులు విస్తరిస్తున్న తరుణాన, పలువురి మన్ననలు పొందడం హర్షణీయం. దీనిలోని అంశాలను ఇంగ్లీషులో ముద్రించమని చాలామంది అడుగుతున్న దానికి మా సమాధానము ఒక్కటే. కొన్ని అంశాలను ఆవశ్యకతను బట్టి ఇంగ్లీషు పదాలను, వాక్యాలను వాడుతున్నాము. కాని కొన్ని అంశాలను ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తే దాని భావం దెబ్బతింటుంది. అవకాశమున్న మేరకు, ఇంగ్లీషులో కూడా ఈ అంశాలను తెచ్చే ప్రయత్నం చేస్తాము త్వరలో.

ఈ సంచికలో ప్రత్యేకత, మీరు ఇప్పటికే గమనించి ఉంటారు. తెలుపు-నలుపు (Black & White) నుండి రంగులతో (Colourలో) రూపుదిద్దుకున్నది. రెండవ విశేషము, ఈ సంచిక నుండి మన 'సంఘమిత్ర' సంచిక http://samghamitra.tripod.com తోపాటూ http://www.sanghamitra.org లో కూడా లభ్యమవుతుంది.

"భక్తినివేదన" నుండి ఏవైనా అంశాలను తిరిగి 'సంఘమిత్ర' లో ముద్రించడానికి అంగీకరించిన త్రిదండి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ చిన జీయరుస్వామి వారికి ధన్యవాదములు. అలాగే 'కాణ్వమంజరి' నుండి అంశాలను పునర్ముద్రించేందుకు అంగీకరించిన యాజ్ఞవల్క్య పరిషత్ కార్యవర్గానికి కూడా ధన్యవాదములు. మేము విద్యాభ్యాసము గావించిన, విశాఖపట్నములోని A.V.N. కళాశాల ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేసిన శ్రీ ముసునూరి లక్ష్మీ గణపతి శాస్త్రిగారు "సంఘమిత్ర" సంచికను గురించి విన్నదే తడవుగా, వారి శిష్యకోటిలో ఒకరైన సంపాదక బృంద సభ్యుని ఆశీర్వదిస్తూ, వారిచే రచించబడిన 'సామెత కథలు', 'జాతీయం కథలు' వంటి పుస్తకాలు పంపి మా ప్రయత్నానికి చేయూత నిస్తున్నందుకు వారికి మా ధన్యవాదములు.

సెయింట్ లూయిస్ దేవాలయ అర్చకులు, మాన్యులు శ్రీ శ్రీనివాస్ గారు తమశక్తికొలది తెలుగువాణి సంస్థ ద్వారా మన తెలుగు సాహిత్యాన్ని, దానిలోని అందాల్ని పరిచయము చేస్తూ తెలుగుభాషపై మక్కువ కలుగజేసేందుకు చేస్తున్న కృషి అభినందనీయము. ఈ 'సంఘమిత్ర' ఆవిర్భావానికి కూడా ఆయన ప్రోత్సాహమే కారణము. ఇక ఈ సంచికలో అచ్చుతప్పులు దొర్లకుండా, జాగ్రత్తగా అద్యంతమూ నిశితముగా పరిశీలిస్తూ, సహాయము అందిస్తున్న కాశీసోమయాజుల మధుకు ప్రత్యేక ధన్యవాదములు.

త్వరలో మరి కొన్ని ఆసక్తికరమైన విషయాలు మీ ముందు ఉంచడానికి మా వంతు కృషి చేస్తున్నాము. మీ చేయూత (చదివి మీ సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా, మీకు తెలిసిన అంశాల మీద చిన్న చిన్న వ్యాసాలు, కథలు కవితలు పంపడం ద్వారా) మాకు అందిస్తే, మన 'సంఘమిత్ర' ను మరింత ఆకర్షనీయంగా తీర్చి దిద్దే బాధ్యత మాది. చేతులు కలిపి చప్పట్లు, మనసులు కలిపి ముచ్చట్లు పంచుకుందాం. ఈ సారి కొత్తగా రూపొందించిన "సమస్యలతో'రణం' " , "జనపథం జనపదం" , "మనవే'మన పద్యాలు" మీ మన్ననలకు పాత్రమవుతాయని విశ్వసిస్తూ...

సంపాదక బృందం.